సాక్షి తిరుపతి

శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



పొగలు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్తున్న పీఎస్ఎల్వీ సీ-59 రాకెట్

● జైత్రయాత్ర

పీఎస్ఎల్వీ రాకెట్ బహుళ ప్రయోజనకారిగా మారి ఇస్రో చరిత్రను తిరగరాస్తోంది. ప్రపంచ పటం మీద ఇస్రో తిరుగులేని వజ్రాయుధంగా మారుతోంది. పోలార్ లాంచింగ్ శాటిలైట్ వెహికల్ (పీఎస్ఎల్వీ) వాణిజ్యపరమైన ప్రయోగాల్లో బ్రహ్మాస్త్రంలా మారింది. శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి గురువారం సాయంత్రం 4.04 గంటలకు ప్రయోగించిన పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగంతో ఇప్పటిదాకా 61 ప్రయోగాలు చేయగా రెండు ప్రయోగాలు మాత్రమే విఫలమయ్యాయి. అతి పెద్ద ఉపగ్రహాలను ఇస్రో ఫ్రాన్స్, రష్యా అంతరిక్ష సంస్థల నుంచి పంపిస్తుంటే అతిచిన్న విదేశీ ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ ద్వారా ప్రయోగించి వాణిజ్యపరంగా ఆదాయాన్ని తీసుకొచ్చే అతిపెద్ద ఆదాయ గనిగా మారింది. చంద్రయాన్, మంగళ్యాన్, సూర్యయాన్ లాంటి గ్రహాంతర ప్రయోగాలు, ఒకే సారి పది ఉపగ్రహాలు, మళ్లీ 20 ఉపగ్రహాలు, ఆ తరువాత 104, మళ్లీ 38 ఉపగ్రహాలను మోసుకెళ్లి అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టగలిగిన సత్తా పీఎస్ఎల్వీకే మాత్రమే దక్కింది. ఇప్పటిదాకా 61 పీఎస్ఎల్వీ రాకెట్ల ద్వారా 503 ఉపగ్రహాలను ప్రయోగించగా ఇందులో 433 విదేశీ ఉపగ్రహాలే కావడం విశేషం. 70 స్వదేశీ ఉపగ్రహాలతో పాటు దేశంలోని పలు యూనివర్సిటీలకు చెందిన 13 చిన్నపాటి ఉపగ్రహాలను ప్రయోగించారు.

– సూళ్లూరుపేట

న్యూస్‌రీల్

జలహారతి

– గోగర్భం డ్యామ్ వద్ద ప్రత్యేక పూజలు



గోగర్భం డ్యామ్‌ను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్

తిరుమల: తిరుమలలో కురిసిన వర్షాలతో జలాశయాలు నిండు కుండను తలపిస్తున్నాయి. నీటి నిల్వలు పూర్తి స్థాయికి చేరుకోవడంతో గోగర్భం డ్యామ్ వద్ద గురువారం టీటీడీ ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు, అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం జలహారతి సమర్పించారు. అదనపు ఈఓ మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురవడంతో తిరుమలలోని గోగర్భం, ఆకాశగంగ, పాపవినాశనం డ్యామ్‌లు పూర్తిగా నిండాయన్నారు. మరోసారి వర్షం పడితే కుమారధార, పసుపుధార డ్యామ్‌లు కూడా నిండిపోతాయని చెప్పారు. ప్రస్తుతం తిరుమలలో రోజుకు 50 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగిస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుత నీటి నిల్వలు 300 రోజులకు సరిపోతాయని చెప్పారు. టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, డెప్యూటీ ఈఓ లోకనాథం, వాటర్ వర్క్స్ ఈఈ సుధాకర్, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతోనే నేల సారవంతం



విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చంద్రగిరి: సేంద్రియ ఎరువులతోనే నేల సారవంతమవుతుందని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. గురువారం ప్రపంచ నేలల దినోత్సవాన్ని ఏ.రంగంపేటలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల నేల సారవంతం తగ్గిపోతుందన్నారు. ప్రకృతి సిద్ధమైన పశువుల ఎరువులు, సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులను రైతులు వినియోగించాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి షణ్ముగం, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, ఏఓ విజయ భాస్కర్, సర్పంచ్ ఎర్రయ్య, జాహ్నవి పాల్గొన్నారు.

కబ్జా కూటమి!



నారాయణాద్రి ఆస్పత్రి- తిరుచానూరు మార్గంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి లే అవుట్ వేసిన దృశ్యం



తమకు న్యాయం చేయాలంటూ తిరుపతి నగరంలో 150 రోజులుగా రోడ్డుపై ధర్నా చేస్తున్న బాధితులు

- తిరుపతి అర్బన్ సర్వే నం.12లో 7 సెంట్ల స్థలం బండి వెంకటసుబ్బమ్మ, లక్ష్మీదేవి పేరున ఉంది. 50 ఏళ్లుగా ఈ స్థలం వీరి ఆధీనంలోనే ఉంది. ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో వీరికి పట్టా కూడా ఇచ్చారు. అందులో పూరిగుడిసె ఏర్పాటు చేసుకుని నివాసం ఉండేవారు. 2011లో రేకుల షెడ్డు వేసుకునేందుకు ప్రయత్నించగా.. ఇద్దరు మహిళలు అడ్డు చెప్పారు. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించగా వెంకటసుబ్బమ్మ, లక్ష్మీదేవమ్మదే స్థలం అని తీర్పు ఇచ్చింది. రెవెన్యూ వారు పొజిషన్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. ఈ స్థలంపై టీడీపీ నేత కన్నుపడింది. ఇంకేముంది వెంటనే స్థలం ఖాళీ చేసి వెళ్లాలని హుకుం జారీ చేశారు. తమకు న్యాయం చేయాలంటూ 150 రోజులుగా నగరం నడిబొడ్డున టెంటు వేసుకుని ధర్నా చేస్తున్నారు. ఈ విషయాన్ని సీఎం, డెప్యూటీ సీఎంకు లేఖ రాసినా పట్టించుకోలేదని బాధితులు కన్నీళ్లు పెడుతున్నారు.

- తిరుపతి అర్బన్ అక్కారాంపల్లి పరిధిలోని గొల్లవాని గుంటలో సర్వే నం.72/12లో కొందరు స్వాతంత్య్ర సమరయోధులకు ప్రభుత్వం 2007లో మూడు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు పంపిణీ చేసింది. టీడీపీకి చెందిన నాయకుడు ఆ ఇంటి స్థలాలను ఆక్రమించుకున్నారు. అందులో ఏ కృష్ణారెడ్డికి ఇచ్చిన 39ఏ ప్లాట్‌లో నిర్మించుకున్న గదిని కూల్చేశాడు. దీనిపై కృష్ణారెడ్డి కుటుంబీకులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదు. దీనిపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి, సీఎం, డెప్యూటీ సీఎంలకు ఫిర్యాదు చేశారు.
- తిరుపతి రూరల్ మండలం, దామినేడు పరిధిలో సర్వే నం.65/4, 65/18,, 67/17, 67/19లో 55 సెంట్ల విలువైన ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని ఓ రియల్టర్ ఆక్రమించి ప్లాట్లు వేసుకున్నారు. రేణిగుంట మండలం, కరకంబాడి సర్వే నం.453/6, ఆర్ అగ్రహారం సర్వే నం.535, కుర్రకాల్వ సర్వే నం.15, సూరప్పకశం సర్వే నం. 688లోని విలువైన కుంట పోరంబోకు భూమిపై కన్నేసిన కూటమి నేతలు ఆక్రమణలకు తెరలేపారు.



రేణిగుంట: కుర్రకాలువలో కూటమి నేతల ఆక్రమణ

.. ఇది తిరుపతి, రేణిగుంట, తిరుపతి రూరల్‌లోనే కాదు.. జిల్లాలోని ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, బాలాయపల్లి, గూడూరు, చిల్లకూరు, నాయుడుపేట పరిధిలో ఇలాంటి సమస్యలు కోకొల్లలు. కూటమి నేతలు అధికార అండదండలతో విలువైన భూములను ఆక్రమించేస్తున్నారు.

ఎటు చూసినా రెవెన్యూ సమస్యలే!

- ఆక్రమణలకు గురవుతున్న విలువైన భూములు
- విషయం తెలిసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- నిషేధిత జాబితాలో ఉన్నా యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు
- సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- నేటి నుంచి రెవెన్యూ సదస్సులు.. సమస్యలు పరిష్కారమయ్యేనా?

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ, కుంట, చెరువు, కాలువ, మేత పోరంబోకు భూములను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా తమ స్వాధీనంలో ఉన్న భూములను సైతం కబ్జా చేస్తున్నారు. అడ్డుచెబితే ప్రాణాలు తీస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఇవన్నీ తెలిసినా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జూన్ నుంచి 17 వారాల్లో ప్రతి సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులు 2,256 అయితే అందులో రెవెన్యూ సమస్యలే 1,241 ఉండడం గమనార్హం. అంటే 55 శాతం వరకు రెవెన్యూ సమస్యలే ఉన్నాయంటే ఏ స్థాయిలో కబ్జా జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఇక రెవెన్యూ డివిజన్, తహసీల్దార్, మున్సిపాలిటీలకు వచ్చిన ఫిర్యాదులు మరో రెండు వేలకుపైనే ఉంటాయని అంచనా.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

కూటమి ప్రభుత్వం శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనుంది. జిల్లా వ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కారిస్తారా? లేదా? వాయిదాలు వేసుకుంటూ కాలం గడుపుతారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

మ్యూటేషన్ అంటే డబ్బులివ్వాల్సిందే

మ్యూటేషన్ చేయాలంటే సంబంధిత అధికారులకు ఎంతో కొంత ఇవ్వందే పనిచేయడం లేదు. డబ్బులు ముట్టజెప్పినా.. పనులు చేసిపెట్టలేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. తిరుపతి జిల్లా వ్యాప్తంగా మ్యూటేషన్ కోసం వచ్చిన దరఖాస్తులు 5,362 ఉండగా.. ఇందులో పరిష్కరించినవి కేవలం 207. ఇందులో అత్యధికంగా పరిష్కారం కాని మండలాల్లో రేణిగుంట, పాకాల, శ్రీకాళహస్తి, వడమాలపేట, తిరుపతి రూరల్, గూడూరు, ఏర్పేడు ఉన్నాయి. అడిగినంత డబ్బులు ఇవ్వలేక పోవడంతో పెండింగ్‌లో పెట్టేశారని బాధితులు చెప్పుకొస్తున్నారు.

వైద్య పరిశోధనలపై ఎంఓయూ



ఎంఓయూ పత్రాలతో ఎస్వీయూ, మెడికల్ కళాశాల అధికారులు

తిరుపతి సిటీ: వైద్య పరిశోధనలపై ఎస్వీయూ, ఎస్వీ వైద్య కళాశాల మధ్య పరస్పర ఒప్పందం కుర్చుకున్నారు. ఈ మేరకు గురువారం ఎస్వీయూ వీసీ చాంబర్‌లో వీసీ సీహెచ్ అప్పారావు, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్, అధికారులు ఒప్పందపు పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వైద్య పరిశోధనలో వస్తున్న పలు మార్పులను శోధించడం, సైన్స్ అండ్ సోషల్ సైన్స్‌లో పరిశోధనలు చేపట్టడంపై వైద్య కళాశాలతో వర్సిటీ ఒప్పందం కుదుర్చుకోవడం శుభపరిణామమన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ భూపతినాయుడు, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారధిరెడ్డి, డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

సమస్త వేదాల సారమే సామవేదం

తిరుపతి సిటీ: సమస్త వేదాల సారమే సామవేదమని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ సామవేద గొప్పతనాన్ని తెలియజేశారని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. ఎస్వీ వేదిక్ వర్సిటీలో గురువారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న సామవేద జాతీయ సదస్సు ప్రారంభకార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వేదిక్ వర్సిటీలో రెండు శాఖలుగా జరుగుతున్న సామవేద బోధన, మిగిలిన శాఖల పరిరక్షణ సైతం వర్సిటీలో జరగాలని ఆకాంక్షించారు. అనంతరం వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి మాట్లాడారు.

నేడు పేరెంట్స్, టీచర్స్ మీటింగ్



ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆ మేరకు ప్రజా ప్రతినిధులు, రైతు సంఘం నేతలతో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,322 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, అందులో ప్రాథమిక పాఠశాలలు 1,741, ప్రాథమికోన్నత పాఠశాలలు 250, ఉన్నత పాఠశాలలు 331 ఉన్నాయని తెలిపారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో 1,50,257 మంది విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందించనున్నట్టు వెల్లడించారు. విద్యాశాఖతోపాటు సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, గురుకుల స్కూల్స్ భాగస్వాములు కావాలని సూచించారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

ఫలితాల విడుదల

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో జరిగిన ఎంపీఈడీ నాల్గోవ సెమిస్టర్, ఎంకామ్ నాల్గో సెమిస్టర్, ఎంబీఏ రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు వర్సిటీ అధికారులు గురువారం విడుదల చేశారు. విద్యార్థులు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.



పుష్ప జాతర!

పుష్ప-2 బెనిఫిట్‌షో రప్ప..రప్పలాడించింది. తగ్గేదేలే అంటూ అభిమానులను ఉర్రూతలూగించింది. థియేటర్ల వద్ద అభిమానుల కోలాహలం కనిపించింది. డప్పు వాయిద్యాలతో పుష్ప-2 జాతరను తలపించింది. స్క్రీన్‌పై బొమ్మ పడే సరికి థియేటర్లలో చిత్తూరు యాస కేక పుట్టించింది. పాన్ ఇండియా రేంజ్‌లో తిరుపతి గంగమ్మ జాతరను చూపించడం కేరింతలు కొట్టించింది. మొత్తం మీద కనీవిని ఎరుగని రీతిలో పుష్ప-2కు అభిమాన కెరటం పోటెత్తింది.



- చిత్తూరు, తిరుపతి జిల్లాలో పుష్ప-2 హౌస్‌ఫుల్
- రప్ప..రప్ప లాడించిన బెనిఫిట్ షో
- థియేటర్ల వద్ద అభిమానుల సందడి
- పాన్ ఇండియా రేంజ్‌కు తిరుపతి గంగ జాతర
- చిత్తూరు యాసే సినిమాకు హైలెట్

కాణిపాకం: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో బుధవారం రాత్రి పుష్ప-2 చిత్రం విడుదలైంది. భారీ అంచనాలతో తెరకెక్కిన ఈ చిత్రం అభిమానులు, ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది. పోస్టర్లు, ట్రైలర్లు ఆకట్టుకుంటూ వచ్చాయి. దీంతో పుష్ప-2 భారీగా జనాదరణను కూడగట్టుకుంది. రెండు జిల్లాల పరిధిలో మొత్తం 135పైగా థియేటర్లు ఉండగా ఇందులో 115 థియేటర్లలోనూ పుష్ప-2 రిలీజ్ చేశారు. బెనిఫిట్‌షోలకు ప్రేక్షకులు క్యూ కట్టారు. రాత్రి 7 గంటల నుంచి ఆయా థియేటర్ల వద్ద అభిమానులు సందడి చేశారు. డప్పు దరువుతో చిందులేశారు. అల్లు అర్జున్ భారీ కటౌట్‌లు, పోస్టర్లకు పాలాభిషేకం చేశారు. చేతిలో కర్పూరం అంటించి దిష్టి తీశారు. సినిమా బంపర్ హిట్ కొట్టాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొందరు పుష్ప జాతర గెటప్ వేసుకుని థియేటర్ల వద్ద సందడి చేశారు. ఇక రాత్రి 9 గంటలకు కొన్ని చోట్ల బెనిఫిట్ షోలు నిర్వహించారు. మరికొన్ని చోట్ల 9.30, 9.45 గంటలకు బెనిఫిట్ షో వేశారు. కొన్ని చోట్ల గేట్లపైకి దూసుకెళ్లారు. పుష్ప-2 నినాదాలతో హోరెత్తించారు.

యాంటీ ఫ్యాన్స్

పుష్ప-2 రిలీజ్ కాకముందు నుంచే యాంటీ ఫ్యాన్స్ రెచ్చిపోయారు. సినిమాపై ట్రోల్స్ చేస్తూ వచ్చారు. రిలీజ్ అయిన తర్వాత కూడా వాళ్ల ట్రోల్స్‌కు అంతు లేకుండా పోతోంది. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ట్రోల్స్ చేస్తున్నారు. వారికి అల్లుఅర్జున్ అభిమానులు, పుష్ప-2 ప్రేక్షకులు ఘాటుగా సమాధానమిస్తున్నారు.

తిరుపతి గంగమ్మ జాతర సీనే హైలెట్

చిత్తూరు జిల్లా అంటేనే గంగమ్మ జాతరకు ప్రత్యేకం. అలాంటి జాతరకు ఈ పుష్ప-2లో ప్రాధాన్యత ఇచ్చారు. ప్రధానంగా తిరుపతి గంగమ్మను పాన్ ఇండియా రేంజ్‌లో తీసుకెళ్లారు. మాతంగి వేషధారణలో అల్లుఅర్జున్ ఫైట్, పాట సీన్‌లలో 10 నుంచి 15 నిమిషాల వ్యవధి పాటు కనిపిస్తాడు. మళ్లీ క్లైమాక్స్‌లో అమ్మవారి వేషధారణ అబ్బురపరిచింది. చిత్తూరు జిల్లా అంటే చాలా మంది ఎర్రచందనం మాత్రమే స్పెషల్ అనుకుంటారు. అయితే పుష్ప-1, పుష్ప-2లో చిత్తూరు యాస, గంగమ్మ జాతరకు ప్రాధాన్యమిచ్చారు.

యాస ఉంటాది..సామీ

సినిమా హైలెట్‌లో చిత్తూరు యాస ఒకటి. 'నా నోటితో చెప్పలేనుగానీ మీరే వెళ్లి చూడండి' అన్నట్టుగానే ఉంది. చిత్తూరు యాసను అచ్చుగుద్దినట్లు దింపేశారు. నటీనటులందరూ యాసలో ఇరగదీశారు. ఇక భాకరపేట, వరదయ్యపాళెం, మంగళం, తడ చెక్‌పోస్టులు, నగరి, చిత్తూరు జిల్లా ప్రస్తావనతో చిత్తూరోళ్లలో ఉత్సాహాన్ని రేకెత్తించింది.

బుకింగ్‌లు.. హౌస్‌ఫుల్

కొత్త సినిమా వస్తే పట్టణ ప్రాంతాల్లో తొలి రోజు రెండు, మూడు థియేటర్లల్లో మాత్రమే ఆడేది. సినిమాకు హిట్ టాక్ వస్తే మరో రెండు రోజుల పాటు కొనసాగుతుంటాయి. అయితే ఎన్ని థియేటర్లు ఉంటే అన్ని థియేర్లలోనూ సినిమాలు వేయడం పుష్ప-2 ఒక్కటేనని థియేటర్ నిర్వాహకులు చెబుతున్నారు. ఇక సినిమా రిలీజ్ డేట్ ప్రకటించడంతో కొన్ని రోజులకు ముందు నుంచే టిక్కెట్ల బుకింగ్ ప్రారంభయ్యాయి. బెనిఫిట్ షోకూ గంటల వ్యవధిలోనే టిక్కెట్లన్నీ అమ్ముడుబోయాయి. గురువారం కూడా అన్ని థియేటర్లు, అన్ని షోలు హౌస్‌ఫుల్ అయ్యాయి. ఈ బెనిఫిట్ షోలకు అభిమానులు మాత్రమే కాదు వివిధ శాఖల అధికారులు క్యూ కట్టారు. యువతులు సైతం ముందు వరుసలో నిలిచారు. బెనిఫిట్ షోలో దెబ్బలు పడుతాయ్ రో..అనే పాటకు డ్యాన్స్‌లు, రీల్స్ చేస్తూ ఉత్సాహంతో కనిపించారు. కాగా శని, ఆదివారాలకు అప్పుడే టిక్కెట్లు బుక్కయ్యినట్టు తెలిసింది.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 65,265 మంది స్వామివారిని దర్శించుకోగా 21,284 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.27 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు పంచమితీర్థం

చంద్రగిరి: తిరుచానూరు బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమితీర్థం(చక్రస్నానం) శనివారం ఉదయం 12.10గంటలకు పుష్కరిణిలో అత్యంత వైభవంగా జరగనుంది. ఈ మేరకు టీటీడీ అధికారులు పూర్తిచేశారు. వీవీఐపీ, వీఐపీ, ఉద్యోగులకు ప్రత్యేకంగా గ్యాలరీలను ఏర్పాటుచేశారు. పుష్కరిణిలోకి భక్తులు దూసుకురాకుండా సింధు జంక్షన్ నుంచే గేట్లు ఏర్పాటు చేశారు. ఉదయం 9గంటల తర్వాత పుష్కరిణిలోకి పాత పోలీస్‌స్టేషన్ మార్గంలో భక్తులను అనుమతించనున్నారు. సింధు జంక్షన్, స్వర్ణముఖి నది సమీపం, తనపల్లి క్రాస్, మూడవ మైలు రోడ్డులో ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటుచేశారు.



క్లుప్తంగా

శ్రీరంగం వైష్ణవుల సేవలు అమోఘం


శ్రీరంగం వైష్ణవులను సత్కరిస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు, జేఈఓ వీరబ్రహ్మం

చంద్రగిరి: శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్స వాల్లో ఉదయం, సాయంత్రం వాహన సేవ లలో 2.5 టన్నుల బరువు ఉన్న వాహనాన్ని మోస్తున్న శ్రీరంగం శ్రీవైష్ణవులను గురు వారం 10 గ్రాముల శ్రీవారి వెండి డాలర్, స్వామి వారి ప్రసాదాలతో టీటీడీ ఈఓ జే.శ్యామలరావు సన్మానించారు. ఈ సంద ర్భంగా ఈఓ మాట్లాడుతూ.. శ్రీవైష్ణవ సం ప్రదాయపరులు గత 32 ఏళ్లుగా విశేష సేవలు అందిస్తున్నారన్నారు. ఒక్కో వాహనం దాదాపు 2.5 టన్నులకు పైగా బరువు ఉంటుందని తెలిపారు. వాహన బేరర్లు అందరూ చెన్నై, బెంగళూరు, హైదరా బాద్ తదితర ప్రాంతాల్లో ఐటీ రంగంలోను, రైల్వే, బ్యాంక్, ప్రభుత్వ ఉద్యోగులుగా పని పనిచేస్తున్నారని, వీరితోపాటు విద్యార్థులు కూడా ఉన్నట్లు వివరించారు. జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్ఓ శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఈఓ గోవింద రాజన్, అన్నప్రసాదం స్పెషల్ ఆఫీసర్ జీఎల్ఎన్ శాస్త్రీ ఇతర శాఖల ఉన్నతా ధికారులు, ఉద్యోగులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

తేరు.. భక్తజన హోరు


రథంపై ఊరేగుతున్న సిరుల తల్లి(ఇన్‌సెట్) ముత్యపు కవచ అలంకరణలో శ్రీపద్మావతీ అమ్మవారు


మహారాణి అలంకరణలో పద్మావతీ అమ్మవారు


వాహన సేవలో అలరిస్తున్న కళాకారులు

తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం ఉదయం అమ్మవారికి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రథంపై ముత్యపు కవచ అలంకరణలో శ్రీపద్మావతి అమ్మవారు కొలువుదీరి తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల కోలాటాలు, భజన బృందాలు, గోవిందనామ స్మరణ నడుమ అమ్మవారి రథోత్స వాన్ని ప్రారంభించారు. అమ్మవారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. మధ్యాహ్నం 12 గంటలకు రథ మండపంలో అమ్మవారికి వేడుకగా స్నపన తిరుమంజనం, సాయంత్రం ఆస్థా నమండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి అశ్వ వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ ఈఓ శ్యాలమరావు, జేఈఓ వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, డెప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఆలయ అర్చకులు బాబుస్వామి పాల్గొన్నారు.

– చంద్రగిరి

హెచ్చరిక

ఇందు మూలముగా యావత్తు ప్రజానికానికి తెలియజేయడం ఏమనగా, మా కక్షిదారుడు అయిన ఎస్. ఖాదర్ భాషా, 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టుయందు O.S. 77/2024 అను దావా ఇ.మునిరత్నం నాయుడు వగైరాల పయిన రూ.5,21,89,182/- (అక్షరాలా ఐదు కోట్ల ఇరవై ఒక్క లక్షల ఎనభై తొమ్మిది వేల నూట ఎనభై రెండు రూపాయలు మాత్రమే) తిరిగి పొందుటకు గాను దావా వేసియున్నారు. సదరు దావా యందు I.A.No. 257/2024 అను పిటీషన్ వేసి, క్రింద కనపరచిన షెడ్యూల్ దాఖలా ఆస్తి ఎ. 1.03½ సెంట్లు భూమిని జప్తు చేయమని కోరడం అయినది. కావున సదరు ఇ. మునిరత్నం నాయుడు వగైరాలతో క్రింద కనబరచిన షెడ్యూల్ ఆస్తి నిమిత్తం ఎటువంటి లావాదేవీలు జరిపిన చెల్లనేరవు మరియు అట్టి వారిపై మా కక్షిదారుడు తీసుకొను సివిల్, క్రిమినల్ చర్యలకు భాద్యులు అవుదురు.

షెడ్యూలు : తిరుపతి జిల్లా, తిరుపతి, చంద్రగిరి ఉపజిల్లా, తిరుపతి రూరల్ మండలం, చెర్లోపల్లి గ్రామ పంచాయతి మరియు గ్రామ లెక్కదాఖలా 54, S.No.224, ప్రస్తుత ఆన్‌లైన్ S.No.224/B మొత్తం విస్తీర్ణం ఎ.1.03½ సెంట్లులో వేయబడిన ప్లాట్ నెం.లు 1 నుండి 12 వరకు ఇందుకు హద్దులు. **తూర్పు :** రోడ్డు, **పడమర :** ఎ. చెంచయ్య వగైరాలు అమ్మిన భూమి, **దక్షిణం :** ఇ. అంజనేయుల నాయుడు వగైరాల భూమి, **ఉత్తరం :** ఇ. సర్వేనెంబర్‌లో మిగిలిన భూమి.

ప్లాటు కొలతలు : ప్లాట్ నెం. 1) 34.33 , 2) 35.41, 3) 36.28, 4) 30, 5) 46.77, 6) 48.54, 7) 50.20, 8) 51.66, 9) 52.70, 10) 53.125, 11) 54.58, 12) 93.75 మొత్తం విస్తీర్ణం : 587.345 అంకణాలు.

షెడ్యూలు బి : అయిటెమ్ నెం.1 : తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల గ్రామలెక్కదాఖలా, చంద్రగిరి SRO, ఎ. 0.43 సెంట్లు, S.No. 171/1, **అయిటెమ్ నెం.2 :** తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల గ్రామ లెక్కదాఖల, చంద్రగిరి SRO, ఎ. 1.45 సెంట్లు, S.No. 517/బి, **అయిటెమ్ నెం.3 :** తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల గ్రామ లెక్కదాఖల, చంద్రగిరి SRO, ఎ. 0.52 సెంటు, S.No. 543/2.

ఇట్లు : **జి.శ్రీనివాసులు గౌడ్, జి.జ్యోత్స్న,**
న్యాయవాదులు, తిరుపతి. సెల్ : **99669 88228**

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA Regular/lateral entry.9381287629

Real Estate

FLAT FOR SALE
తిరుపతి-తిరుచానూర్ రోడ్డులో పద్మావతి కళ్యాణ మండపం వెనుక నారాయణపురంలో శ్రీమహాలక్ష్మి రెసిడెన్సీ G.18, 1542 Sqfts.తూర్పు ముఖం గల Flat అమ్మబడును. 9849595987.

PLOTS FOR SALE
పూర్తిగా ఉచితి... ఉచితం. పుత్తూరు కళ్యాణపురం, వినాయకపురం రోడ్ 2400Sq 15 లక్షలు పెట్టి ఒక Plot కొంటే 1800 Sq Plot పూర్తిగా ఉచితం. ఒకే ఒక Plot మాత్రం ఉంది. త్వరపడండి. సంప్రదించండి సెల్: 9944197991, 9042290608.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

Wanted

Collection Executives in Chittoor, Madanapalli, Piler, Srikalahasthi, Tirupati. Q:Inter, Degree, Good Salary+ Incentives.9347357251, 7842861911.

ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోమ్ అవకాశం కలదు. 8121818692

ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- 10th to డిగ్రీ, Sal:- 20k-25k ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. 8073902428

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ. 15 వేలు - 40వేలు.ఫ్రీ రూం+భోజనం. HYD. 8317512135

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆటో డ్రైవర్లపై క్రిమినల్ చట్టాలా?

పాకాల : రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లపై క్రిమినల్ చట్టాలను తీసుకరావడం దారుణమని జిల్లా కార్యవర్గ సభ్యులు రామతుల్లా పేర్కొన్నారు. గురువారం మండలంలోని దామలచెరువులో జరిగిన ఫ్రెండ్స్ డ్రైవర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, మండల కన్వీనర్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లపై తెచ్చిన క్రిమినల్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కారు ఢీకొని విద్యార్థినికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడిన విద్యార్థిని లహరి

పాకాల: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొన్న ఘటనలో విద్యార్థిని తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని గాందంకి ఎన్ఏఆర్ఎల్ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. విద్యార్థిని లహరి తిరుపతి పద్మావతీ మహిళా కళాశాలలో డిప్లొమా చదువుతోంది. గురువారం గాదంకి ఎన్ఏఆర్ఎల్‌లో ఇంటర్న్‌షిప్‌కు హాజరయ్యేందుకు వెళ్తూ రోడ్డు దాటుతుండగా కారు బలంగా ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన విద్యార్థినీని అంబులెన్స్‌లో తిరుపతి రుయాకు తరలించారు. విద్యార్థిని పరస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన సంతోష్ కుటుంబ సభ్యులు గురువారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. దీనిని ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పర్యాటకరంగంతో దేశాభివృద్ధి


ఎంఓయూ పత్రాలతో కలెక్టర్, ఎస్వీసీఈ ప్రిన్సిపల్, టూరిజం అధికారులు

తిరుపతి సిటీ: పర్యాటకరంగాన్ని విస్తృతం చేయడంతో దేశాభివృద్ధికి అవకాశం ఉంటుందని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అభిప్రాయపడ్డారు. గురువారం స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలతో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పలు అంశాల మీద ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్థూల జాతీయోత్పత్తి, ఉపాధి అవకాశాలు మెరుగుపడడంలో పర్యాటక రంగానిదే కీలక పాత్ర అని తెలిపారు. అనంతరం టూరిజం అథారిటీ తిరుపతి రీజనల్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రమణప్రసాద్, ఎస్వీసీఈ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి పరస్పరం ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తారకేశ్వర్, డాక్టర్ నీరజ, డాక్టర్ శిరీష, డాక్టర్ గౌతమి, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

27 నుంచి జాతీయ నాటక నృత్య పోటీలు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: సుబ్బరాజు నాట్య కళాపరిషత్ 63వ వార్షిత్సవం సందర్భంగా ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు మహతి కళాక్షేత్రంలో జాతీయ స్థాయి నాటక, నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు సుబ్బరాజు నాట్య కళాపరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎమ్మెల్యే ఇంటి వద్ద జాతీయ స్థాయి నాటక, నృత్య పోటీల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. సుబ్బరాజు నాట్య కళాపరిషత్ కార్యదర్శి డీ.గోపాలరావు, సంయుక్త కార్యదర్శులు జింక నారాయణస్వామి, మేకల గంగయ్య పాల్గొన్నారు.

పరామర్శిస్తూ.. అండగా నిలుస్తూ..!

- బాధితులకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరామర్శ
- అండగా ఉంటానని కార్యకర్తలకు భరోసా
- అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు
- బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


మాజీ ఏఎంసీ చైర్మన్ మునీర్, అతని కుమారుడు అఫ్రీద్‌ను పరామర్శిస్తున్న మోహిత్‌రెడ్డి


వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను పరామర్శిస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల: టీడీపీ గూండాల దాడిలో గాయపడ్డ బాధితులను చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటానని ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం చేసుకుని బతికే ముస్లింలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సబబుకాదన్నారు. సుమారు 15 ఏండ్లుగా వ్యాపారం చేసుకుని జీవనం చేసుకునే వారిపై కక్షగట్టి దుకాణాలను తొలగించడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మునీర్‌కుమారుడు అఫ్రీద్ పుష్పా-2 సినిమాకి ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకుంటే ఓర్వలేక టీడీపీ అల్లరి మూకలు ఫ్లెక్సీని చించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

అక్రమ కేసులు పెడితే ప్రైవేటు కేసులు తప్పవు

స్థానిక రామకృష్ణ డీలక్స్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఆధారంగా చేసుకుని అమాయకులపై కేసులు పెడితే సహించేది లేదని మోహిత్‌రెడ్డి గుర్తు చేశారు. దాడులకు పాల్పడిన టీడీపీ గూండాలను వదిలేసి, గాయపడ్డ వారిపై కేసుల బనాయించారని ఆరోపించారు. అమాయకులపై కేసులు పెట్టే పోలీసు అధికారులపై ప్రైవేట్ కేసులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ముస్లిం మహిళలపై కర్రలతో దాడి చేసిన వారిపై కూడా తమ పార్టీ తరపున పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీకి, రోడ్డు పక్కన ఉన్న దుకాణాలకు ఏమి సంబంధం ఉందని దుకాణాలను తొలగించారో అర్థం కావడం లేదన్నారు. దుకణాలు కోల్పోయిన బేటాబాయ్, ఖాదర్‌బాషాకు తక్షణ సాయం కింద రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి



చంద్రగిరి: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందిన ఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ అనిత వివరాల మేరకు... మండల పరిధిలోని కాశిపెంట్ల హెరిటేజ్ ఫ్లైఓవర్ వద్ద తెల్లవారుజామున సుమారు 45 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. అదేవిధంగా చంద్రగిరి నాగాలమ్మ కూడలి సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన మరో వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ అనిత ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అందులో ఒకరు జేబులో పాస్‌పోర్టు సైజ్ ఫొటోను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుల ఆచూకీ తెలిసిన వారు చంద్రగిరి పోలీసులను సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

అర్జీలకు రసీదులివ్వండి


కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి అర్బన్: రెవెన్యూ సదస్సులను నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ప్రతి అర్జీకి ఒక రసీదు ఇస్తే ఇంకా బాగుంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత గురువారం కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్జీలను ముద్రించి ఇవ్వాలన్నారు.

ప్రసాదం పోటు ఇన్‌చార్జ్ సస్పెన్షన్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రసాదం పోటు ఇన్‌చార్జ్ సురేష్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు ఈఓ బాపిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం సాధారణ తనిఖీల్లో భాగంగా ప్రసాదం పోటును పరిశీలించగా సాధారణం కన్నా ఎక్కువ ప్రసాదం ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి ప్రశ్నించగా.. సమాధానం చెప్పకపోవడంతో అతనిపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

అక్రమ నిర్మాణాలను కూల్చేయండి!



మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతిస్వామి

తిరుపతి కల్చరల్: టీటీడీ, తుడా, పంచాయతీ ఆదేశాలను కూడా లెక్క చేయకుండా చేపడుతున్న ముంతాజ్ హోటల్ అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీ పాలక మండలి సమావేశంలో ముంతాజ్ హోటల్ నిర్మాణాన్ని రద్దు చేసి తీర్మానం చేసినా కూడా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. పేరూరు పంచాయతీ కార్యదర్శి ఈనెల 4వ తేదీన ముంతాజ్ హోటల్ అక్రమ నిర్మాణాలపై నోటీసు ఇచ్చినా అదే రోజు రాత్రి 11 గంటల వరకు అక్రమణ నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. ముంతాజ్ హోటల్‌కి ఇచ్చిన 20 ఎకరాల భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని, లేని పక్షంలో స్వామిజీలతో హిందూ సంఘాలతో కలిసి అమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. సాధు పరిషత్ గౌరవాధ్యక్షుడు అట్లూరి నారాయణరావు, తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు ఓంకార్, అభయహస్త గోవింద సేవ అధ్యక్షుడు చంద్రమౌళి, పేరూరు బాలకృష్ణ, మధు, నీలకంఠ పాల్గొన్నారు.

చూసేవారు ఎవరూ లేని..

– ఆత్మహత్య చేసుకున్న వృద్ధుడు


మృతి చెందిన వృద్ధుడు రమణయ్య

దొరవారిసత్రం: చూసేవారు ఎవరూ లేరని... ఏకైక సంతానం అయిన కుమార్తె ఉన్నా ప్రయోజనం లేక... భార్య సైతం పట్టించుకోక పోవడంతో చేసేదీమీలేక ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన దొరవారిసత్రం మండలం, వెదురుపట్టురాజుపాళెం ఎస్టీ కాలనీలో చోటుచేసుకుంది. ఈ ఘటన బుధవారం చోటు చేసుకోగా గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు.. వెదురుపట్టురాజుపాళెం ఎస్టీ కాలనీకి చెందిన చిలకల రమణయ్య(67)కు భార్య సుబ్బులమ్మ, కుమార్తె ఉంది. కుమార్తెను అదే కాలనీలో ఇచ్చి వివాహం చేశాడు. భార్య బుచ్చినాయుడుకండ్రిగ మండలం, పుత్తేరిలోని మనుమరాలు వద్ద ఉంటోంది. వృద్ధుడు ఎన్నిసార్లు భార్యను పిలిచినా రాకపోవడంతంతో చూసేవారు ఎవరూ లేరని మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చుట్టు పక్కల వారు గుర్తించి చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వృద్ధుడి పరిస్థితి విషయంగా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం నెల్లూరుకు తరలింగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం స్థానిక పోలీసులు హెచ్‌సీ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ డీఈఓ

నారాయణవనం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి నవీన్‌కుమార్ సాఫ్ట్ బాల్ క్యాచర్‌గా జాతీయ స్థాయి అండర్-14 పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సులోచన, పీడీ జయప్రకాష్ తెలిపారు. గత వారం అరగొండ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన్న అండర్-14 రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో తిరుపతి జిల్లా జట్టు క్యాచర్‌గా ప్రతిభను కనబరిచిన 9వ తరగతి విద్యార్థి నవీన్‌కుమార్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈ నెలలో రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు జయప్రకాష్ తెలిపారు. అలానే గత వారం తిరుపతి మంగళం ట్రెండ్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన అండర్-14 బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో 8వ తరగతి చదువుతున్న పాఠశాల విద్యార్థి బాలాజీ బంగారు పథకాన్ని సాధించినట్టు వెల్లడించారు. గురువారం పాఠశాల ప్రార్థన సమయంలో పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రాజు ఆధ్వర్యంలో క్రీడాకారులను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులను, పాఠశాల పీడీలు జయప్రకాష్, సదాశివంను డిప్యూటీ డీఈవోతో పాటు ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్, వర్మ, కోటి, వెంకటరమణ, మునివేలు, ఓసైమల్లీ తదితరులు అభినందించారు.